# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వాట్సప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **అహ్మదాబాద్‌లో జరిగే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు పాల్గొంటారు.**
3. **విజయవాడ ప్రాంతీయ నూతన పాస్ పోర్టు కార్యాలయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈరోజు ప్రారంభిస్తారు.**
4. **తెలంగాణ నుంచి కృత్రిమ మేధా నిపుణులను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పేర్కొన్నారు.**
5. **అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను వాట్సప్ గవర్నెన్స్ వంటి సాంకేతిక మార్గాల ద్వారా అందించే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్- ఆర్టీజీఎస్‌పై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మరింత పారదర్శకంగా సుపరిపాలనను అందించేందుకు ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మొబైల్ ఫోన్ ద్వారా మనమిత్ర వాట్సప్ సేవలు పొందడంలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దీనికి అనుగుణంగా ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న వైద్య, ఆరోగ్య, ఆహార విభాగాల పురోగతిపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పాత్రికేయులకు వివరించారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. ఉప్పు, వంటనూనె, పంచదార వాడకం తగ్గించాలని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 23 సెకన్లు

---------------------------

అహ్మదాబాద్‌లో జరిగే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ–ఏఐసీసీ సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు, రేపు గుజరాత్‌లో పర్యటించనున్నారు.ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ఈ సమావేశాల్లో తెలంగాణ కాంగ్రెస్ నుంచి మొత్తం 44 మంది నాయకులకు ఆహ్వానం అందినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే, బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ తీర్మానం, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలను ఈ సమావేశాల్లో వివరించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతీయ నూతన పాస్ పోర్టు కార్యాలయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈరోజు ప్రారంభిస్తారని ప్రాంతీయ పాస్ పోర్టు అధికారి శివహర్ష వెల్లడించారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడలో కార్యాలయం ప్రారంభం కావడం వల్ల త్వరగా సేవలు అందుతాయన్నారు. పాస్ పోర్టు దరఖాస్తుల తనిఖీ, ప్రింటింగ్, జారీ లాంటి ప్రక్రియలన్నీ విజయవాడ కార్యాలయం ద్వారానే జరుగుతాయని ఆయన తెలియజేస్తూ

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆక్వా రంగంపై అమెరికా సుంకాల ప్రభావం తాత్కాలికమేనని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో ఆక్వా రంగ నిపుణులు, వ్యాపారులు, అధికారులతో మంత్రి నిన్న సమావేశమైయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా లభ్యమైన ఆక్వా ఉత్పత్తులను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, సీడ్స్ తయారు చేసేవారు, నిపుణులు, ఫీడ్ తయారుచేసే నాలుగు రంగాలతో పాటు ప్రభుత్వంతో కలిసి కమిటీ ఏర్పాటు చేసేలా... సమావేశంలో నిర్ణయించామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్ ..30 సెకాన్లు

---------------------------

దేశంలో వ్యవస్థాపక రంగంలో గణనీయ ప్రభావం చూపిన ప్రధాన మంత్రి ముద్రా యోజన ఈ రోజుతో 10 సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సమ్మిళిత అభివృద్ధి, అత్యంత అణగారిన వర్గాలకు చేరువ కావాలనే 'అంత్యోదయ' స్ఫూర్తికి ఊతమిస్తూ ముద్రా యోజనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015 ఏప్రిల్ 8వ తేదీన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం దశాబ్దం కిందట ప్రారంభమై ఇప్పటి వరకు 52 కోట్లకుపైగా రుణాలను ఆమోదించి, 33 లక్షల కోట్ల రూపాయాలకు పైగా నిధులను విజయవంతంగా లబ్ధిదారులకు పంపిణీ చేసింది. కాగా ముద్రా యోజన దశాబ్దకాల పురోగతిపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణ నుంచి రెండు లక్షల మంది  కృత్రిమ మేధా నిపుణులను  తయారు చేయాలన్నదే  ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ  ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ‘నూతన సాంకేతికతలకు  కేంద్రంగా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వారికి వివరించారు.  ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.

---------------------------

దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.  ఆంధ్రప్రదేశ్‌లో వాతవారణ పరిస్థితిపై అమరావతి వాతావరణ  కేంద్ర అధికారి ఎం.వెంకటరావ్ తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం  పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 4 వేల 285 కోట్ల రూపాయలను విడుదల చేసింది. రాజధానిలో నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధుల నుంచి 25 శాతం నిధులను మంజూరు చేసింది. కేంద్రం వాటా 750 కోట్ల రూపాయలను కలిపి మొత్తం 4 వేల 285 కోట్ల రూపాయలను విడుదల చేసింది. అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నందున 25 శాతం నిధులు ముందస్తుగా ఇవ్వాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీయే కోరిన నేపథ్యంలో కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది.

=====================